## డేటా ఎంట్రీ ఆపరేటర్లకు నేడు ప్రత్యేక శిక్షణ

హుస్నాబాద్ టౌన్, జనవరి 4 : ప్రజాపాలన దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేసేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన ఆపరేటర్లతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన 10 మంది శుక్రవారం సిద్దిపేటలో జరిగే శిక్షణకు హాజరుకానున్నారు. ప్రజాపాలన కార్యక్రమం దరఖాస్తుల స్వీకరణ ఈనెల 6న పూర్తికానుండడంతో ఆ దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేసేందుకు ఆపరేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు మున్సిపల్ అధికార వర్గాలు తెలిపాయి.

## గురుకులాల్లో ప్రవేశాలకు పరీక్ష

నారాయణరావుపేట, జనవరి 4 : ప్రభుత్వ గురుకులాల్లో 2024-25 విద్యాసంవత్సరంలో 5వ తరగతి ప్రవేశాలకు ఫిబ్రవరి 11న ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు గుర్రాలగొంది సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.లింగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో ఈనెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 180042545678 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

## దరఖాస్తులు ఆహ్వానం

సిద్దిపేట టౌన్, జనవరి 4 : ఉగాది బాలల కథల పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సుగుణ సాహితీ సమితి జిల్లా కన్వీనర్ బైతి దుర్గయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలల్లో సాహిత్య అభిరుచిని పెంపొందించి సృజనాత్మకతను వెలికితీయాలనే సంకల్పంతో బాలల కథల పోటీలు ఏటా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలకు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు నగదు బహుమతి అందజేస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 99590 07914 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

## డీజిల్ చోరీ

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 4 : ట్రాక్టర్ ట్యాంకుల నుంచి డీజిల్ చోరీకి గురైన ఘటన బుధవారం రాత్రి మద్దూరు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామంలోని చిలుక పరశురాములు, సూర్న అశోక్, రఫీ ట్రాక్టర్ల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్ దొంగిలించారు. మరోవైపు నీల రాకేశ్‌కు చెందిన బైక్ నుంచి పెట్రోల్ చోరీ చేశారు. మంగళవారం సాయంత్రం పెట్రోల్ ట్యాక్టర్ల డ్రైవర్లు సమ్మె చేస్తున్నట్లు ప్రచారం కావడంతో పలువురు యజమానులు ట్రాక్టర్ ట్యాంకుల నిండా డీజిల్ నింపారు. మరుసటి రోజు ట్యాంకుల్లో ఉన్న డీజిల్ చోరీకి గురికావడంతో ట్రాక్టర్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిందితులను గుర్తించి శిక్షించాలని కోరుతున్నారు.

## యువకుడి హల్‌చల్

సిద్దిపేట టౌన్, జనవరి 4 : ఫుల్‌గా తాగి ఓ యువకుడు కల్లు దుకాణంలో హల్‌చల్ చేసిన ఘటన సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని గణేశ్‌నగర్‌లో గల కల్లు దుకాణంలో యువకుడు బన్ని ఫుల్‌గా కల్లు తాగి అక్కడికి వచ్చిన వారితో ఘర్షణకు దిగాడు. అడ్డొచ్చిన వారిపై విచక్షణారహితంగా కల్లు సీసాతో దాడికి తెగబడ్డాడు. ఈ దాడిలో పల్లు పురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కల్లు దుకాణ నిర్వాహకుడు దాడిని అడ్డుకునే యత్నం చేయగా, అతనిపై కూడా దాడి చేశా డు. దీంతో భయభ్రాంతులకు గురైన వారు పోలీసులు సమాచారం అందజేశారు. ఘటనాస్థలానికి పోలీసులు చేరుకొని దాడి చేసిన యువకుడిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి

### పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

హుస్నాబాద్, జనవరి 4 : ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సకాలంలో నెరవేర్చాలని పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా(డెమోక్రటిక్) రాష్ట్ర అధ్యక్షుడు పోతునూరి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం హుస్నాబాద్‌లో పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ హామీలను అమలు చేసి తెలంగాణను అభివృద్ధి చేసి చూపించాలన్నారు. మాట తప్పితే ప్రజల పక్షాన నిలబడి కొట్లాడుతామని హెచ్చరించారు. పేదల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీపుల్స్ పార్టీ ఉద్యమిస్తుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు నియోజకవర్గాల నుంచి తమ పార్టీ పోటీ చేసిందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లోనూ పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలోనే జిల్లా, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం రఘు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగారపు తిరుపతి, సుంకరి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కూలీలకు శాపంగా ఆధార్ అనుసంధానం

మర్కూక్, జనవరి 4 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు ఆధార్ అనుసంధానం శాపంగా మారిందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. గురువారం మండలంలోని పాతూరులో పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీలతో శంకర్ సమావేశమయ్యారు. రెండుసార్లు ఫొటో పద్ధతి, ఆధార్ సీడింగ్, ఆలస్యపు వేతనాలు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పక్కాగా అమలు చేయకుండా చట్టానికి విరుద్ధంగా కొత్త నిబంధనలు తీసుకొస్తుందన్నారు. కూలీల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తున్నదన్నారు. కూలీలకు పనులు కల్పించకుండా తప్పించుకునేందుకే కేంద్రం కుట్ర చేస్తున్నదన్నారు. ఆధార్ అనుసంధానం పేరుతో కూలీల పని హక్కులను కాలరాయడం తగదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించి ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న డీబీఎఫ్ కార్యదర్శి శంకర్

# మల్లారెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల, జనవరి 4 : మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కొమ్మూరి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నిర్మించుకున్న ఇంటికి సీపీఎం నాయకులు పలుమార్లు వచ్చారని, అప్పుడు ఎందుకు ఇంటి గురించి మాట్లాడలేదన్నారు. కొమ్మూరిపై చేసిన ఆక్రమణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలున్నా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. నామినేటెడ్ పదవులను అమ్ముకునే దుస్థితిలో కొమ్మూరి లేరన్నారు. సీపీఎం విధానాలు నచ్చక కొందరు నాయకులు కాంగ్రెస్‌లో చేరడంతో జీర్ణించుకోలేక ఆ పార్టీ నాయకులు అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. సీపీఎం నాయకులు ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. లేదంటే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీలు కొమ్ము నర్సింగరావు, దాసరి కళావతి, కౌన్సిలర్ చెవిటి లింగం, టౌన్ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, ఉడుముల భాస్కర్‌రెడ్డి, ముస్త్యాల యాదగిరి, అంబాల నాగేశ్వర్, కామిడీ జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బండెల మహిపాల్‌రెడ్డి, తోర్ల రాజేశ్వరి, వంగ జయ, ఖాజా పాల్గొన్నారు.

# విద్యార్థుల చేతుల్లోనే దేశ నిర్మాణం

దుబ్బాక, జనవరి 4 : భారతదేశాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యత విద్యార్థులపైనే ఆధారపడి ఉందని తెలంగాణ రాష్ట్ర సామాజిక సమరసత వేదిక కన్వీనర్ అప్పల ప్రసాద్‌జీ అన్నారు. గురువారం దుబ్బాక సరస్వతీ గ్లోబల్ స్కూల్‌లో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో వచ్చే సందేహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌జీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సామాజిక రంగంలో రాణించాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేశారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలి


హుస్నాబాద్, జనవరి 4 : విద్యార్థులు చిన్ననాటి నుంచే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని ఆల్ఫోర్స్ స్కూల్‌లో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పాఠశాల ఆవరణలో గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా సెట్టింగులు వేసి గ్రామీణులు, రైతులు, హరిదాసు వేషధారణలతో విద్యార్థులు అలరించారు. భోగి మంటలు వేసి నృత్యాలు చేశారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. వివిధ రకాల వంటకాలు చేసి విద్యార్థులు, తల్లిదండ్రులకు వడ్డించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



భోగి మంటలు వేస్తున్న విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

## సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన 'కొమ్మూరి'

చేర్యాల, జనవరి 4 : మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గురువారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జనగామ నియోజకవర్గం అభివృద్ధి తదితర అంశాలపై సీఎంతో చర్చించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కొమ్మూరి

## హుస్నాబాద్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

హుస్నాబాద్ టౌన్, జనవరి 4 : మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ హరిచందన ఆదేశాల మేరకు హుస్నాబాద్ మున్సిపల్ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి పనులను గురువారం ఎన్‌సీపీఈ కన్సల్టెన్సీ బృందం పరిశీలించింది. స్థానిక ఎల్లమ్మచెరువులో జరిగిన పనులతోపాటు మున్సిపల్ నూతన భవనం, ఎఫ్ఎస్‌టీపీ, వైకుంఠధామం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాలను స్థానిక మున్సిపల్ కమిషనర్ ఎంఆర్ రాజశేఖర్, ఏఈ సాయిప్రణీత్‌తో కలిసి పరిశీలించింది. ఎల్లమ్మ దేవాలయం, బస్‌స్టేషన్, ఫుడ్‌కోర్టు, సెంట్రల్ లైటింగ్, రహదారుల వెడల్పు తదితర కార్యక్రమాల గురించి కమిషనర్‌తో బృందం సభ్యులు చర్చించారు.

## ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలి

సిద్దిపేట, జనవరి 4 : ప్లాస్టిక్ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పౌర సరఫరాలశాఖ జిల్లా అధికారి తనుజ, మేనేజర్ హరీశ్ పిలుపునిచ్చారు. 'ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అనే నినాదంతో కూడిన వాల్ పోస్టర్‌ను గురువారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో ప్రజలు అనేక రోగాలకు గురవుతున్నారన్నారు. మానవ జీవన శైలిలో అనేక మార్పులకు ప్లాస్టిక్ కారణమన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డీటీ జైనులొద్దీన్, రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీ ప్రజావేదిక

హుస్నాబాద్ రూరల్, జనవరి 4 : హుస్నాబాద్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం అధికారులు ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ కింద ఏప్రిల్ 1, 2022 నుంచి మార్చి 1, 2023 వరకు జరిగిన పనులపై అధికారులు ఆడిటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీలు ఓబులేశ్, కౌసల్య, ప్రభాకర్, ఎంపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

చేర్యాల, జనవరి 4 : చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై రామ్మోహన్ సూచించారు. గురువారం పట్టణంలోని వికాస్ హైస్కూల్‌లో పోక్సో, బాల్యవివాహాలు, ఉమెన్ షీటీమ్ ప్రాముఖ్యత, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎలియాస్, ఉపాధ్యాయులు, పీసీలు స్వప్న, ప్రశాంతి, కృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.

## సిద్దిపేటలో సదరం క్యాంప్

సిద్దిపేట, జనవరి 4 : దివ్యాంగుల గుర్తింపు కోసం సదరం క్యాంప్ నిర్వహించినట్లు డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్యా తెలిపారు. గురువారం సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో శారీరక అంగవైకల్యం గలవారు 40 స్లాట్ బుక్ చేసుకోగా, 67 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగవైకల్యం గలవారికి వైద్యులు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాస్, రాజ్‌కుమార్, శ్రీదేవితోపాటు డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దుబ్బాక, జనవరి 4 : దుబ్బాక మున్సిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని హబ్షీపూర్ 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు (2 గంటలపాటు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుబ్బాక, ధర్మాజీపేట, చెల్లాపూర్, మండలంలోని బొప్పాపూర్, రఘోత్తంపల్లి, పెద్దచీకోడు, రామక్కపేట, గంభీర్‌పూర్, పోతారం, పెద్దగుండవెల్లి, అప్పనపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల వనభోజనాలు

హుస్నాబాద్, జనవరి 4 : హుస్నాబాద్ ఆర్టీసీ డిపో ఉద్యోగులు గురువారం వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు డిపో ఆవరణలో ఈ కార్యక్రమం చేపట్టారు. డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉద్యోగులందరూ ఉత్సాహంగా గడిపారు. వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. నవంబర్, డిసెంబర్‌లో విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ నర్సయ్య, అధికారులు సామ్యుల్, లక్ష్మారెడ్డి, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.